RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా


www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 84 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం | 25.09.2026 | పేజీలు : 8

22 A భూముల్లో రిజిస్ట్రేషన్లకు సర్కారు గ్రీన్ సిగ్నల్

- 22ఏ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకు వర్తింపు
- తక్షణమే అమల్లోకి వచ్చిన తాజా ఆదేశాలు
- వేలాది మంది ఆస్తి యజమానులకు దక్కనున్న భారీ ఊరట
- అక్రమాలపై విచారణకు శ్రీదేవసేన
- నేతృత్వంలో ప్రత్యేక కమిటీ



నిత్యం నిఘా, హైదరాబాద్ : రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు.ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు" : కేటీఆర్



- దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు
- ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్
- ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ
- రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు

2

బాలాపూర్‌కు ముందే రికార్డు మోత..

- హైదరాబాద్‌లో కోటి పలికిన గణేశుడి లడ్డూ!



- రాజేంద్రనగర్ కీర్తి రిచ్‌మండ్‌లో కోటి దాటిన గణేశ్ లడ్డూ వేలం
- శక్తిమాన్ బృందం రూ.1.01 కోట్లకు లడ్డూ కైవసం
- గతేడాది ఇదే కమ్యూనిటీలో లడ్డూ రూ.2.31 కోట్లు పలికిన రికార్డు
- రేపు జరగనున్న బాలాపూర్ లడ్డూ వేలంపై ఉత్కంఠ
- గతేడాది బాలాపూర్ లడ్డూ ధర రూ.35 లక్షలుగా నమోదు

2

హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు

- గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఎస్సై వెంకన్న మృతి
- హైదరాబాద్‌లో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఘటన
- ప్రమాదం తర్వాత స్వగ్రామానికి వెళ్లగా ఆరోగ్యం క్షీణించి కన్నుమూత

నిత్యం నిఘా, హైదరాబాద్ : భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి .....



2

అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..



2

'ఎన్నికలకు సిద్ధం అవుతా'..

సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

- సుప్రీం తీర్పును గౌరవిస్తున్నానన్న దానం
- న్యాయపోరాటం చట్టపరంగానే చేశానని వెల్లడి
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సిద్ధమని ప్రకటన
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మార్గం సుగమం



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టు తీర్పుపై స్పందించారు. అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పును సంపూర్ణంగా గౌరవిస్తున్నానని తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ పట్ల ఉన్న గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని చెప్పారు. ఇక తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఇలా వస్తుందని ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టపరంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో తాను సిద్ధంగా ఉన్నట్లు దానం తెలిపారు. ఖైరతాబాద్ ప్రజలతో తనకు దశాబ్దాలుగా అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ వారికి అండగా ఉన్నానని చెప్పారు. రాబోయే ఉప ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతానన్నారు. ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

2

వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

- సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు బ్యాంకుల సమ్మె
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ముందే జీతాలు
- సెప్టెంబర్ 25నే వేతనాలు చెల్లించాలని కేంద్రం ఆదేశం
- ప్రజల సౌలభ్యం కోసం ఆదివారం బ్యాంకులు తెరిచి ఉంచాలని నిర్ణయం



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి.

2

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది : హరీశ్ రావు

- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ
- ఇప్పటి వరకు డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్య



2

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం : జగదీశ్ రెడ్డి

- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పరిశీలించిన జగదీశ్ రెడ్డి
- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
- 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని మండిపాటు



2

'ఎన్నికలకు సిద్ధం అవుతా'..

సుప్రీం తీర్పుపై దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించి ఖైరతాబాద్ సీటు ఖాళీ అయినట్లు పేర్కొంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. నేడు అత్యున్నత న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది.

అకోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

మొదటిపేజీ తరువాయి.. దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (P2M – పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే (P2P – పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (P2PM) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

వ్యాపారుల ఆందోళన ఎందుకు?

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (MACCIA), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (AICPDF) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

బాలాపూర్‌కు ముందే రికార్డు మోత..

హైదరాబాద్‌లో కోటి పలికిన గణేశుడి లడ్డూ!

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో గణేశ్ లడ్డూ వేలం పాటలో మరోసారి భారీ ధర నమోదైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేలంలో గణపతి లడ్డూ ఏకంగా రూ.1.01 కోట్లు పలికింది. ప్రతి ఏటా పోటాపోటీగా జరిగే ఈ వేలంలో ఈసారి శక్తిమాన్ బృంద సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు. కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిటీ వాసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. ఈసారి కూడా అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన వేలంలో శక్తిమాన్ బృందం విజయం సాధించింది. గతేడాది (2025) ఇదే కమ్యూనిటీలో లడ్డూ రికార్డు స్థాయిలో రూ.2.31 కోట్లు పలకడం గమనార్హం. ఆ రికార్డుతో పోల్చిస్తే ఈసారి ధర తక్కువే అయినప్పటికీ, కోటి రూపాయల మార్క్‌ను దాటడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం వల్ల శుభం, ఐశ్వర్యం కలుగుతాయనే బలమైన విశ్వాసంతో భక్తులు ఎంతటి ధరకైనా వెనుకాడటం లేదు. హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాటలు కోట్లలో జరుగుతుండగా, ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే బాలాపూర్ లడ్డూ వేలంపై కేంద్రీకృతమైంది. రేపు చారిత్రక బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం జరగనుంది. 1994లో కేవలం రూ.450తో మొదలైన ఈ వేలం ప్రస్థానం, మూడు దశాబ్దాల్లో లక్షల రూపాయలకు చేరింది. గతేడాది బాలాపూర్ లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకోగా, 2024లో రూ.30.01 లక్షలు పలికింది. ఈసారి పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన బాలాపూర్ గణపయ్య లడ్డూ (21 కిలోలు) కొత్త రికార్డు సృష్టిస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. గేటెడ్ కమ్యూనిటీలలో కోట్లలో ధర పలుకుతున్న నేపథ్యంలో బాలాపూర్ లడ్డూ ఆ రికార్డులను అందుకుంటుందా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. బాలాపూర్ వేలం అనంతరం జరిగే గణేశుడి శోభాయాత్రతోనే నగర నిమజ్జనం ప్రారంభం కావడం ఆనవాయతీ.

హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం..

- నిందితుడి కోసం పోలీసుల గాలింపు

మొదటిపేజీ తరువాయి.. పరారయ్యాడు. ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామానికి కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఎస్సై మృతిపై సీపీ సజ్జనార్ తీవ్ర విచారం

ఎస్సై వెంకన్న మృతి పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. "గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకన్నగారు గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించడం అత్యంత బాధాకరం, దుర దృష్టకరం. ప్రజల భద్రత కోసం పనిచేస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం తెలంగాణ పోలీసు శాఖకు తీరని లోటు" అని అన్నారు. ఈ విషాద సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కమిషనర్, ఆ కుటుంబానికి శాఖా పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో బొగ్గు కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం : జగదీశ్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..
నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఎదుర వుతున్న బొగ్గు కొరతకు, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన ఈరోజు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్లాంట్ అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడానికి గల సాంకేతిక, పరిపాలనాపరమైన కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, ప్లాంట్లకు సక్రమంగా సరఫరా చేయకుండా దాదాపు 40 లక్షల టన్నుల బొగ్గును పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలోని పవర్ ప్లాంట్లకు బొగ్గు కొరత సృష్టించి, ప్రజలను ముఖ్యంగా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏ విధంగానైతే 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిందో, అదే రీతిలో పవర్ ప్లాంట్లకు పూర్తిస్థాయిలో బొగ్గు సరఫరా చేసి నిరంతర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది : హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి..
తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

వరుసగా 3 రోజులు బ్యాంకుల బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా సెప్టెంబర్ నెల జీతాలు, పెన్షన్లను ముందుగానే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 25వ తేదీనే వేతనాలు అందనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ఈ మేరకు ఒక అధికారిక మెమోరాండం విడుదల చేసింది. దీని ప్రకారం, రక్షణ, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ విభాగాలతో సహా అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు శుక్రవారం నాడే జీతాలు చెల్లించనున్నారు. అదే రోజున కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా పెన్షన్లు అందజేస్తారు. ఈ ముందస్తు చెల్లింపులను అక్టోబర్ బకాయిలలో సర్దుబాటు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు ఈ సమ్మె కొనసాగనుంది. ఇది బ్యాంకులకు అర్ధ సంవత్సర ముగింపు సమయం కావడం గమనార్హం.

స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు" : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ @రాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ప్రశ్నించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పీఏసీఎస్ చైర్మన్లుగా అనిల్‌రావు, కుమారస్వామి





వరంగల్ / పర్వతగిరి, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి, చౌటపల్లి పీఏసీఎస్‌ల నూతన చైర్మన్లుగా పిన్నింటి అనిల్‌రావు, అత్తి కుమారస్వామి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్లతో పాటు ఆయా పీఏసీఎస్‌ల డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ కడియం కావ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు అవసర మైన సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని, గతంలో జరిగిన తప్పిదాలను పరిశీలించి వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యత లను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందాల్సిన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎరువుల విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్త కుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, ఆయా గ్రామాల అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై నూతన చైర్మన్లు, డైరెక్టర్లకు శుభాకాం క్షలు తెలిపారు.

మహంకాళి వీధిలో ఘనంగా గణపతి విగ్రహ ఉద్వాసన





వరంగల్, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగ రంలోని 42వ డివిజన్ మహంకాళి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి విగ్రహ ఉద్వాసన కార్యక్రమాన్ని శ్రీ వెలిది ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. కాలనీవాసుల సహకారంతో ఉత్సవా లను ఐకమత్యంతో నిర్వహించుకో వడం అభినందనీయమన్నారు. సంఘంలోని సభ్యులు, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవా లకు సహకరించిన దాతలు, కాలనీవా సులు, సంఘం సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రతి సంవత్సరం మరింత భక్తిశ్రద్ధలతో గణపతి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.

మామిడిగూడెంలో కంటైనర్ పాఠశాల ప్రారంభం

- సింగరేణి సీఎస్ఆర్ నిధులతో రూ.15 లక్షలతో ఏర్పాటు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): ఏటూ రునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశా లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరా వుతో కలిసి ప్రారంభించారు.అనంతరం మంత్రి సీతక్క పాఠశాల విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశా లలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు జిల్లా కలెక్టర్‌తో కలిసి ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు, సంబంధిత శాఖల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు





పాల్గొన్నారు..

తాళ్ల మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు

వరంగల్ , సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చార్‌బౌలి ప్రాంతానికి చెందిన లర్నెస్ ల్యాండ్ స్కూల్, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గురువారం ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా తాళ్ల మల్లేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరా మర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి, సీనియర్ నాయకులు



కోమాకుల నాగరాజు, రత్నం కృష్ణకిషోర్, ముత్తినేని లక్ష్మణ్, మరుముల్ల ప్రవీణ్, మంతెన అనిత తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే.. కాటాపురం రోడ్ల దుస్థితి

- అధ్వానంగా రోడ్లు.. అసంపూర్తిగా డ్రైనేజీ పనులు
- నీటి నిల్వలతో దోమల బెడద.. సీజనల్ వ్యాధులపై ఆందోళన



ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు సగం వరకే పూర్తికావ డంతో వర్షం పడినప్పుడు నీరు రోడ్లపై నిలిచిపో తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అపరిశుభ్రత నెలకొని దోమల బెడద పెరుగుతోందని, సీజనల్ వ్యాధులు, డెంగ్యూ వంటి వ్యాధులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొంతమంది రైతులు పశువులను రోడ్లపైనే కట్టివేయడంతో రాకపోక లకు ఇబ్బందులు ఏర్పడు తున్నాయని ప్రజలు చెబు తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరి స్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. గ్రామంలోని సైడ్ కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో వాటిలో కూడా నీరు నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. మరోవైపు కొంతమంది గ్రామపంచాయతీ సరఫరా చేస్తున్న నీటిని అవసరమైనంత మేరకు వినియోగించుకుని, మిగిలిన నీటిని రోడ్లపైకి వదులుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా రోడ్లపైకి నీటిని వదిలే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే గ్రామంలో దోమలు, కోతుల బెడద నివారణకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యలను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటాపురం గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతు న్నారు.

మేడారంలో కొబ్బరికాయకు అధిక ధరలు?

- ₹30 కొబ్బరికాయను ₹60కు విక్రయిస్తున్నారంటూ భక్తుల ఆరోపణలు
- ధరల పట్టిక ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని డిమాండ్



ములుగు జిల్లా / మేడారం, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లుల సన్నిధిలో పూజా సామగ్రి విక్రయాలపై భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరు వ్యాపారులు కొబ్బరికాయలు, ఇతర పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని భక్తులు ఆరోపి స్తున్నారు. సాధారణంగా సుమారు రూ.30కు లభించే కొబ్బరికాయను మేడారంలో రూ.60కు విక్రయిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిం చారు. ధరపై ప్రశ్నిస్తే కొందరు వ్యాపారులు టెండర్ పేరుతో సమాధానం చెబుతున్నారని వారు పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి మేడారం వచ్చే భక్తులు పూజా సామగ్రిని తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి ఉండటంతో, వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూజా సామగ్రి విక్రయించే దుకాణాల్లో స్పష్టమైన ధరల పట్టిక ఏర్పాటు చేసి, ధరలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని భక్తులు కోరుతున్నారు. అధిక ధరలపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. “సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించు కోవడానికి భక్తితో వస్తున్నాం. పూజా సామగ్రికి అధిక ధరలు చెల్లించా ల్సిన పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి” అని పలువురు భక్తులు కోరారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు



వరంగల్ /పర్వతగిరి, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు గురువారం పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చౌటపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన తక్కళ్లపెల్లి సమ్మారావు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన రాములు, ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం సోమారం గ్రామంలో మాజీ సర్పంచ్ వంగాల రవీందర్ అత్తమ్మ జంగిలి కొమురమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లి సర్పంచ్ మట్టపల్లి వెంకటేశ్వర్‌రావు, చౌటపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ లింగంపల్లి కుమార్‌రావు, మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ జూలపల్లి గంగాధర్‌రావు, జాటోతు శ్రీనివాస్, మేచినేని మాధవరావు, జూలపల్లి సురేందర్‌రావు, గొనె సంపత్, కంటెం ఏకాంతం, వర్ధినేని భూపాల్‌రావు, మెడిశెట్టి సుధాకర్, అంక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలు

- హనుమకొండలో ఘనంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలు



హనుమకొండ, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని 61వ డివిజన్ సిద్ధార్థనగర్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పాట భక్తుల ఉత్సాహంతో సందడిగా సాగింది. వేలం పాటలో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి గొట్టిముక్కుల సాగరిక రమాకాంత్‌రెడ్డి పోటీపడి రూ.99,999లకు స్వామివారి ప్రసాదమైన లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు, ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. సిద్ధార్థనగర్‌తో పాటు డివిజన్ పరిధిలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

అక్టోబర్ 1లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి

- రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారి కె. దుర్గాప్రసాద్ సూచన



ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను నిరంతరాయంగా పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి కె. దుర్గాప్రసాద్ సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ ద్వారా ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలను పొందేందుకు ప్రత్యేక సౌకర్యం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఎరువుల బుకింగ్‌కు ఫార్మర్ ఐడీ తప్పనిసరి చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోని రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ), మీ–సేవ కేంద్రం లేదా తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలు పొందడంలో ఎలాంటి అంతరాయం కలగకుండా రైతులు తమ ఫార్మర్ రిజిస్ట్రేషన్ స్థితిని వెంటనే పరిశీలించుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1లోగా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ పొందేలా ప్రతి రైతు చర్యలు తీసుకోవాలని కె. దుర్గాప్రసాద్ కోరారు.

బిట్టుపల్లిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

- సర్వేకు ప్రజలు సహకరించాలి: గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్



పెద్దపల్లి జిల్లా /మంథని, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (PLFS)–2026లో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో సర్వే నిర్వహించినట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ ఆరిపొద్దు, ఎంపీడీవో కంకణాల శ్రీజారెడ్డిని వారి కార్యాలయాల్లో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాధాన్యతను వారికి వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలపై విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు PLFS నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొదటి దశలో ఎంపిక చేసిన కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసి, అనంతరం ఆయా కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని చెప్పారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులతో పాటు జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో పనిచేస్తున్న గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామని పేర్కొన్నారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచి, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా సర్వే సిబ్బందికి సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మంథని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, మంథని ఎంపీఎస్‌వో సంధ్యారాణి, సర్పంచ్ పోగుల లావణ్య మహేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గువ్వల రాజమల్లు, పంచాయతీ కార్యదర్శి మర్రిపల్లి విజయ్, అంగన్‌వాడీ టీచర్ మంథని లక్ష్మి , ఆశా వర్కర్ మంతెన కనకలక్ష్మి , కరోబార్ మంతెన రాజశేఖర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ బస్టాండ్‌లో బీజేపీ వినూత్న నిరసన

- నీటి గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తూ నిరసన
- బస్టాండ్‌లో శాశ్వత డ్రైనేజీ పరిష్కారం చూపాలని డిమాండ్



హనుమకొండ, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ బస్టాండ్ ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గోపికృష్ణ నాయక్ త్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్టాండ్‌లోని నీటి గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని చేతులతో, ప్లాస్టిక్ తట్టల సహాయంతో తొలగిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ హనుమకొండ బస్టాండ్‌కు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వర్షం కురిసినప్పుడు బస్టాండ్ ప్రాంగణంలో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బస్టాండ్‌లో డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల నిర్వహణపై అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. నీరు నిలిచిపోవడం వల్ల దోమల బెడద పెరిగి సీజనల్ వ్యాధుల ప్రమాదం ఉందని, నీటి గుంతల కారణంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి, రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరఫున ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నతల్లిని హత్య చేసిన కొడుకు

- కాజీపేటలో విషాద ఘటన.. అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు



హనుమకొండ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజిల్ కాలనీ బాలాజీనగర్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉదయశ్రీ (38) అనే మహిళ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందగా, ఆమెను స్వంత కొడుకే హత్య చేసి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ఇంట్లో రక్తపు మడుగులో మహిళ

స్థానికుల సమాచారం ప్రకారం.. గురువారం ఇంటి నుంచి ఎలాంటి అలజడి కనిపించక పోవడంతో అనుమానం వచ్చిన కొందరు స్థానికులు ఇంటి వద్దకు వెళ్లి చూడగా ఉదయశ్రీ రక్తపు మడుగులో అచేతనంగా కనిపించినట్లు తెలుస్తోంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

రంగంలోకి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

సమాచారం అందుకున్న కాజీపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనాస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

కారణాలపై ఆరా,

ఈ ఘటనపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే హత్యకు అసలు కారణం ఏమిటి, ఘటనలో ఎవరి ప్రమేయం ఉంది అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

కన్నతల్లి అనుమానాస్పదంగా మృతి చెందడం, ఈ ఘటనకు ఆమె కుమారుడిపై అనుమానాలు వ్యక్తమవుతుండటంతో బాలాజీనగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.

తాడ్వాయిలో రూ.7 కోట్ల గోదాముకు శంకుస్థాపన



ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల కేంద్రంలో అభివృద్ధి పనుల్లో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముకు ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. గోదాము నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన ఆవాసాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణం, సౌర విద్యుత్, తాగునీటి సౌకర్యాల విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, ములుగు మార్కెట్ చైర్మన్ రేగ కళ్యాణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంకిడి నరసింహస్వామి, నరసాపూర్ సర్పంచ్ యాప మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ ముంద్రాతి రాజశ్రీ, బొల్లు దేవేందర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

డబ్బు చుట్టూ తిరుగుతున్న బంధాలు...

- మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న వేళ...

నిత్యం నిఘా స్పెషల్ : ఒకప్పుడు మనిషి విలువ అతని సంపదలో కాదు... అతని సంస్కారంలో ఉండేది. బంధాలకు డబ్బు కొలమానం కాదు. స్నేహానికి లాభనష్టాల లెక్కలు ఉండేవి కావు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, రక్తసంబంధాలను గౌరవించడం సమాజపు సహజ లక్షణాలుగా ఉండేవి.

కానీ కాలం మారింది. ఆర్థిక వ్యవస్థ మారింది. జీవన విధానం మారింది. వినియోగ సంస్కృతి పెరిగింది. దాని ప్రభావం మనిషి ఆలోచనా విధానంపైనా పడింది. నేడు అనేక సంబంధాల్లో ప్రేమ కంటే ప్రయోజనం, ఆత్మీయత కంటే అవసరం, నమ్మకం కంటే లాభనష్టాల లెక్కలు ముందుకు వస్తున్నాయి.

"నీ దగ్గర ఏముంది?" అనే ప్రశ్న... "నీలో ఏముంది?" అనే ప్రశ్నను మించిపోతున్న కాలమిది.

బంధాల మధ్య ఆస్తి గోడలు

కుటుంబమే సమాజానికి పునాది. కానీ అదే కుటుంబంలో ఆస్తి, డబ్బు, వారసత్వం వంటి అంశాలు బంధాల మధ్య గోడలు కడుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. తల్లిదండ్రుల ఆస్తి కోసం పిల్లల మధ్య విభేదాలు, వారసత్వం కోసం బంధువుల మధ్య వివాదాలు, ఆర్థిక సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు... ఇవన్నీ మానవ సంబంధాలపై ఆర్థిక ప్రభావం ఎంతగా పెరిగిందో తెలియజేస్తున్నాయి.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా నిలవడం కొందరికి బాధ్యతగా కాకుండా భారంగా అనిపించడం మరింత ఆందోళన కలిగించే పరిణామం. జీవితమంతా పిల్లల కోసం త్యాగం చేసిన తల్లిదండ్రులకు చివరి దశలో ఆప్యాయత కంటే ఒంటరితనం మిగిలితే, సమాజం తన ప్రగతిని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిందే.

వివాహ బంధాల్లోనూ ఆర్థిక లెక్కలు

వివాహ బంధంలోనూ ఆర్థిక లెక్కలు చొరబడుతున్నాయి. ఉద్యోగం, జీతం, ఆస్తి, హోదా, కట్నం, కానుకలు... ఇవన్నీ కొన్నిసార్లు మనిషి వ్యక్తిత్వం, సంస్కారం, పరస్పర గౌరవం కంటే ఎక్కువ ప్రాధాన్యత పొందుతున్నాయి.

స్నేహాలు కూడా ఇందుకు అతీతం కావు. అవసరంలో ఉన్నప్పుడు గుర్తు చేసుకునే పరిచయాలు పెరుగుతున్నాయి. అవసరం తీరిన తర్వాత దూరమయ్యే బంధాలు కూడా పెరుగుతున్నాయి.

ఆర్థిక ప్రగతి కావాలి... మానవత్వం కోల్పోయే మూల్యానికి కాదు

డబ్బు అవసరం. ఆర్థిక భద్రత అవసరం. కుటుంబాన్ని నడపడానికి సంపాదన అవసరం. భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఆర్థిక ప్రణాళిక అవసరం. కానీ డబ్బు జీవితానికి సాధనం కావాలి... జీవితానికి యజమాని కాకూడదు.

డబ్బుతో ఇల్లు కొనవచ్చు... కానీ ఇంట్లో ఆప్యాయతను కొనలేం. డబ్బుతో సౌకర్యాలు పొందవచ్చు... కానీ మనశ్శాంతిని కొనలేం. డబ్బుతో పరిచయాలు పెంచుకోవచ్చు... కానీ నిజమైన నమ్మకాన్ని కొనలేం.

అందుకే ఆర్థిక ప్రగతితో పాటు మానవీయ ప్రగతి కూడా అవసరం.

విలువలను నేర్పాల్సిన బాధ్యత కుటుంబానిదే

మానవ సంబంధాలు, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, పెద్దల పట్ల గౌరవం, తోటి మనిషికి సహాయం చేయడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం వంటి విలువలు ఏ ఒక్క సమాజానికో, వర్గానికో పరిమితమైనవి కావు. ప్రతి మతం, ప్రతి సంస్కృతి, ప్రతి సంప్రదాయం తనదైన రీతిలో ఈ మానవీయ విలువలను తరతరాలకు అందిస్తూ వస్తోంది.

మత పెద్దలు, ఆధ్యాత్మిక గురువులు, సామాజిక పెద్దలు తమ ప్రసంగాలు, బోధనలు, ఆచారాలు, సంప్రదాయాల ద్వారా కుటుంబ విలువలను, తల్లిదండ్రుల పట్ల గౌరవాన్ని, దయను, సేవాభావాన్ని, పరస్పర సహకారాన్ని ప్రజలకు తెలియజేస్తూనే ఉన్నారు.

అయితే బోధనలు వినడంతోనే మార్పు రాదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే మానవీయ విలువలను నేర్పాలి. డబ్బు సంపాదించడం ఎలా అన్నదే కాదు... మనిషిగా ఎలా జీవించాలి, పెద్దలను ఎలా గౌరవించాలి, అవసరంలో ఉన్నవారికి ఎలా అండగా నిలవాలి, బంధాలను ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను కూడా పిల్లలకు నేర్పాలి.

పిల్లలు పెద్దలను చూసి నేర్చుకుంటారు. అందుకే మాటల్లో విలువలు చెప్పడం కంటే, ఆ విలువలను ఆచరణలో చూపించడం మరింత ప్రభావవంతం.



మార్పు మన నుంచే మొదలవ్వాలి

సమాజంలో మార్పు రావాలంటే ఒక్క వర్గం, ఒక్క కుటుంబం మారితే సరిపోదు. ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో మారాలి. తల్లిదండ్రులు మారాలి... పిల్లలు మారాలి... కుటుంబాలు మారాలి... సమాజం మారాలి.

మనిషిని ఆర్థిక ప్రయోజనాలతో కాకుండా మానవీయ విలువలతో చూడగలిగినప్పుడే సంబంధాలకు తిరిగి గౌరవం వస్తుంది.

చివరికి మిగిలేది సంపద కాదు... మనుషులే

జీవితం చివరి దశలో మనిషి తన బ్యాంకు ఖాతాను చూసుకుని సంతోషించడు. తన చుట్టూ ఉన్న మనుషులను చూసుకుని సంతృప్తి చెందుతాడు.

మన కోసం నిజంగా నిలిచిన వారు ఎవరు? మన కష్టంలో మన చేయి పట్టిన వారు ఎవరు? మన కన్నీటిని మాటలు లేకుండానే అర్థం చేసుకున్న వారు ఎవరు? అక్కడే మానవ సంబంధాల అసలు విలువ తెలుస్తుంది. సంపద మనిషి జీవన ప్రమాణాన్ని పెంచవచ్చు... కానీ మానవత్వమే జీవిత ప్రమాణాన్ని పెంచుతుంది. డబ్బు సంపాదిద్దాం... కానీ మనుషులను కోల్పోకుండా.

ఆస్తులు కూడబెట్టుకుందాం... కానీ ఆత్మీయతను తాకట్టు పెట్టకుండా.

ఎదుగుదాం... కానీ మనతో పాటు మనుషుల్ని కూడా నిలబెట్టుకుంటూ. తల్లిదండ్రులు పిల్లలకు మానవత్వాన్ని నేర్పాలి... పిల్లలు ఆ విలువలను జీవితంలో ఆచరించాలి... పెద్దలు తమ ఆచరణతో దారి చూపాలి... సమాజం ఆ విలువలను గౌరవించాలి. అప్పుడు మాత్రమే ఆర్థికంగా అభివృద్ధి చెందిన సమాజం, మానవీయంగా కూడా సంపన్నమైన సమాజంగా మారుతుంది. ఎందుకంటే చివరికి మనిషి జీవితాన్ని గొప్పదిగా చేసేది అతని సంపద కాదు... అతని చుట్టూ మిగిలిన మానవ సంబంధాలే

కాటాపురంలో గణపతికి ప్రత్యేక పూజలు

- నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా యువతకు టీషర్టుల పంపిణీ





ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 24: నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామంలో విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ పులి నర్సయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.పులి నర్సయ్య సోదరుడు పులి రవి–మమత దంపతులు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడినప్పటికీ, స్వగ్రామంపై ఉన్న అభిమానంతో సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమ వంతు సహకారం అందించినట్లు తెలిపారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు పులి నర్సయ్య గణపతి విగ్రహం వద్ద పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చివరి రోజు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, యువతకు టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులి నర్సయ్య మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

మాటిచ్చాం.. చేసి చూపించాం

- గంగాపురి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారుల కోసం చిల్డ్రన్ పార్క్ పూర్తి
- మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో అభివృద్ధికి మరో అడుగు

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 24(నిత్యం నిఘా ప్రతినిధి): ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని గంగాపురి నాలుగో వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గంగాపురి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారుల కోసం చిల్డ్రన్ పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఎరుకల స్రవంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులను చేపడుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గంగాపురి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్క్ చిన్నారులకు ఆహ్లాదంతో పాటు ఆటల ద్వారా శారీరక ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంలో భాగంగా ఈ పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గంగాపురి



అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కౌన్సిలర్ పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎరుకల స్రవంతి రమేష్ బాబు అన్నారు.

ఖానాపూర్‌లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులైన కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడమే లక్ష్యం

పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇమంథని మండలం ఖానాపూర్ గ్రామంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ దొరగొర్ల శ్రీనివాస్ యాదవ్, గ్రామశాఖ ప్రతినిధులు లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా దొరగొర్ల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ కింద బియ్యం తదితర ప్రయోజనాలు అర్హులకు అందుతాయని పేర్కొన్నారు.మంథని నియోజకవర్గంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అర్హులైన కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు వారికి చేరేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డు సభ్యుడు జంజర్ల శ్రావణ్, గ్రామశాఖ ఉపాధ్యక్షులు పుట్ట



సుధాకర్, జంజర్ల చందర్, నార్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు.

చంద్రుపట్ల ప్రభుత్వ పాఠశాలలో యూనిఫామ్స్, షూస్ పంపిణీ

- విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించడమే లక్ష్యం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: హెచ్ఎం సంతోష్



ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): వాజేడు మండలం చంద్రుపట్లలోని ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఏకరూప దుస్తులు, షూస్, సాక్సులు, బెల్టులను గురువారం పంపిణీ చేశారు. పాఠశాల సర్పంచ్ అనుముల సంధ్యారాణి, పాఠశాల కమిటీ చైర్మన్ గట్టి లలిత చేతుల మీదుగా విద్యార్థులకు సామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఏకరూప దుస్తులు, షూస్ తదితర సామగ్రిని అందించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఒకే రకమైన దుస్తులు అందించడం ద్వారా పేద, ధనిక అనే భేదాలు లేకుండా సమానత్వ భావన పెంపొందుతుందని తెలిపారు. కొత్త యూనిఫామ్స్, షూస్, సాక్సులు, బెల్టులు అందడంతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కలుగుతుందని, పాఠశాలకు హాజరయ్యేందుకు ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న పాఠశాల కమిటీ చైర్మన్, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువతకు ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నజీమ్, వార్డు సభ్యులు ఉషారాణి, నాగ భూషణం, సమ్మయ్య, ప్రభాకర్, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కోర్టు తీర్పు తర్వాతా ప్రభుత్వ భూమి స్వాధీనంలో జాప్యం

- మల్లంపల్లిలో 16 గుంటల ప్రభుత్వ భూమిపై వివాదం
- తీర్పు వెలువడినా భూమిని స్వాధీనం చేసుకోకపోవడంపై అధికారుల తీరుపై ప్రశ్నలు





ములుగు జిల్లా/ మల్లంపల్లి, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): మల్లంపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి–163 పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూమి విషయంలో అధికార యంత్రాంగం తీరుపై స్థానికంగా ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. సుమారు 16 గుంటల ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదంలో కోర్టు తీర్పు వెలువడినప్పటికీ, ఆ భూమిని అధికారులు స్వాధీనం చేసుకునే ప్రక్రియ ముందుకు సాగకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి, ప్రజలకు పరిపాలనా సేవలు మరింత అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వ భూములు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో మండల ప్రధాన మార్గంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరో పణలు రావడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారి–163ను ఆనుకుని ఉన్న ఈ భూమికి ప్రస్తుతం మార్కెట్‌లో కోట్ల రూపాయల విలువ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇంత విలువైన ప్రభుత్వ భూమిని పరిర క్షించి, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ చర్యలు కనిపించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కూడా భూమి స్వాధీనం ప్రక్రియ ఎందుకు ఆలస్యమవుతోందనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడటంలో అధికారుల నిర్లక్ష్యానికి కారణాలేమిటన్నది తేలాల్సి ఉందని అంటున్నారు. భూమి స్వాధీనం విషయంలో ఎవరి ఒత్తిళ్లు, ప్రయోజ నాలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, వాటిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు భూమికి సంబంధించిన రికార్డులు, కోర్టు తీర్పు, ప్రస్తుత స్థితిపై స్పష్టమైన వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి కోర్టు తీర్పును అమలు చేసి, ప్రభుత్వ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మల్లంపల్లి మండల ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వర్ధన్నపేటలో 100 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డుల పంపిణీ

- వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాల లబ్ధిదారులకు కార్డులు అందజేత
- కోడిగుడ్డుతో అధిక పోషక విలువలు: ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట నియోజకవ ర్గంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 100 మంది లబ్ధిదారు లకు ఎగ్ కార్డులను పంపిణీ చేశారు. వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు శ్రీ సత్యనారాయణ స్వామి కోళ్ల ఫామ్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ శాసనసభ్యుడు ఆరూరి రమేష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు, యువ నాయకుడు ఆరూరి విశాల్ పాల్గొని లబ్ధిదారులకు ఎగ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్డులో నాణ్యమైన ప్రోటీన్‌తో పాటు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు లభి స్తాయని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు, కండరాల అభివృద్ధికి, శరీరానికి అవసరమైన శక్తిని అందించేందుకు కోడిగుడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందుబాటు ధరలో అధిక పోషక విలువలను అందించే ఆహారంగా కోడిగుడ్డును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎజిల్‌కుమార్, రాజీవ్, కోళ్ల రైతులు సుబ్రహ్మణ్యం, దిలీప్‌రావు, స్థానిక నాయకులు, పౌల్ట్రీ రైతులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ భూసేకరణను వేగవంతం చేయాలి

- 23 ప్రాంతాల్లో భూసేకరణ పురోగతిపై కలెక్టర్ సమీక్ష ఎస్టీపీలు, పంపింగ్–లిఫ్టింగ్స్టేషన్లకు అవసరమైన భూములపై అధికారులకు ఆదేశాలు



హనుమకొండ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ నగరంలో చేపట్టనున్న భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థకు సంబంధించిన భూసేకరణ పురోగతిపై రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలు, మురుగునీటి పంపింగ్ కేంద్రాలు, ఎత్తిపోతల కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూముల వివరా లను సమీక్షించారు. జిల్లాలో మొత్తం 23 ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ఏ మేరకు పురోగతిలో ఉందో అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ఆయా భూముల సేకరణలో ఎ దుర వుతున్న సమస్యలు, తీసుకుం టున్న చర్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనుల అమలుకు భూసేకరణలో ఎలాంటి జాప్యం జరగ కుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావే శంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, తహసీల్దార్లు, భూసేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూమి హక్కులను కాలరాస్తున్న రెవెన్యూ అధికారులు

- వాజేడు తహసీల్దార్‌ను తక్షణమే బదిలీ చేయాలి
- ఎడజర్లపల్లి భూ సమస్యను పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతాం: ఏఎన్ఎస్ మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు



ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆదివాసీల భూమి హక్కులను రెవెన్యూ అధికారులు పరిరక్షిం చాలని, ఎడజర్లపల్లి ఆదివాసీ రైతుల భూ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదివాసీ నవనిర్మాణ సేన వాజేడు మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు డిమాండ్ చేశారు. వాజేడు తహసీ ల్దార్ శ్రీనివాసరావును తక్షణమే బదిలీ చేయాలని కోరారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో వాజేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజు దీక్షలను మోడెం నాగరాజు రైతులకు పూలమాలలు వేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వాజేడు మండలంలోని ఆదివాసీల భూ సమస్యలను తహసీల్దార్ పట్టిం చుకోవడం లేదని ఆరోపించారు. చదువులేని ఆదివాసీల పట్టా భూములను గిరిజనేతరులు ఆక్రమించిన విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని అన్నారు. సమస్యపై ప్రశ్నించిన ఆదివాసీ రైతులపైనే కేసులు నమోదు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎడజర్లపల్లి గ్రామంలోని జీ సర్వే నంబర్లు 32, 25లో ఆదివాసీలకు అసైన్మెంట్ పట్టాలు ఉన్నప్పటికీ గిరిజనేతరులు భూములను ఆక్రమించారని నాగరాజు ఆరోపించారు. వాజేడు మండల రెవెన్యూ అధికారులు వలస గిరిజనేతరులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎల్‌టీఆర్ చట్టాన్ని గిరిజనే తరుల ప్రయోజనాలకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ఆదివాసీల భూమి హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఎడజర్లపల్లి ఆదివాసీ రైతుల భూ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఏఎన్ఎస్ రాష్ట్ర సామాజిక మాధ్యమాల అధికార ప్రతినిధి పాయం అజయ్, జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, జిల్లా కార్యదర్శి కంతి విజయ్, వెంకటాపురం మండల అధ్యక్షుడు వాసం నారాయణ, వాజేడు మండల ఉపాధ్యక్షుడు తల్లాడి ప్రసాద్, మండల కార్యదర్శి తలండి సంతోష్, అట్టం బాలకృష్ణ, జగదీష్, ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- చెరువులు, వాగులు, నాలాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలి ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీ ల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు అప్ర మత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసర మైన చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీ వోలతో కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహిం చారు. జిల్లాలో వర్ష ప్రభావం, ప్రస్తుత పరి స్థితులు, గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలకు హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. మండలాల వారీగా నమోదైన వర్షపాతం, చెరువుల పరిస్థితి, వాగులు, వంకలు, రహ దారుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలు సుకున్నారు. గతంలో వర్షాల సమయంలో సమస్యలు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం వేలేరు, ఆత్మకూరు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందన్నారు. గురువారం, శుక్రవారం కూడా ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల అధి కారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, వాగులు, వంకల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని, వరద నీరు రహదారులపైకి వచ్చే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో నీటి నిల్వల వివ రాలను సాగునీటిశాఖ అధికారులు ఎప్పటిక ప్పుడు సేకరించాలని, వర్షపాతం పెరిగిన ప్పుడు నీటిమట్టం, నీటి ప్రవాహ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.భారీ వర్షాల సమయంలో అధి కారులు తమ పరిధిలో స్థానికంగా అందుబా టులో ఉండాలని, సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గతంలో ముంపు, వరదలతో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన ముందస్తు చర్యలను పరిశీలిం చాలని సూచించారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రధాన నాలాల్లో వరద నీరు సజావుగా ప్రవ హించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంతో పాటు అన్ని మండలాల్లో అత్యవ సర సహాయక చర్యలకు అవసరమైన జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లలో అధికా రులు, సిబ్బంది 24 గంటలూ అందుబా టులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించాలని తెలిపారు. రహదా రులు, వాగులు, వంకలు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదే శించారు.వర్షాల కారణంగా ఎక్కడైనా నష్టం సంభవిస్తే వెంటనే వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని, ప్రజలను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సమయంలో శాఖల మధ్య సమన్వ యంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొ రేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, పరకాల మున్సిపల్ కమిషనర్ పవన్, సాగునీటిశాఖ ఈఈ మంగీలాల్, రోడ్లు భవనాలశాఖ ఈఈ దేవిక చౌహాన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

యువత నాయకత్వ వికాసంలో జాతీయ సేవా పథకం కీలకం

- సేవా స్ఫూర్తి, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్‌ది కీలక పాత్ర
- కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



హనుమకొండ/ కే యూ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): యువతలో నాయకత్వ లక్షణాలు, సేవా స్ఫూర్తి, బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడంలో జాతీయ సేవా పథకం కీలక పాత్ర పోషిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం విశ్వ విద్యాలయ ఆడిటోరియంలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహించారు. జాతీయ సేవా పథకం కార్యక్రమ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్ర మానికి ఉపకులపతి ముఖ్య అతిథిగా హాజరై మాజీ, ప్రస్తుత కార్యక్రమ అధి కారులు, వాలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉప కులపతి మాట్లాడుతూ విద్య, పరిశోధ నతో పాటు సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత, నాయకత్వ వికాసం వంటి రంగాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ద్వారా విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలో 360కి పైగా జాతీయ సేవా పథకం యూనిట్లు, సుమారు 35 వేల మంది వాలంటీర్లతో విస్తృత స్థాయిలో సేవా, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. జాతీయ సేవా పథకం సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమాజ అవసరా లకు అనుగుణంగా వాలంటీర్లు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో సేవా స్ఫూర్తితో పాటు నాయకత్వ లక్ష ణాలను పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు. కే-హబ్ ద్వారా విద్యార్థుల్లో వ్యవస్థాపకత, నూతన సంస్థలు, ఆవిష్కరణలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మాజీ పార్లమెంటు సభ్యుడు ఆచార్య ఆజ్మీర్ సీతారాం నాయక్ సహకారంతో జాతీయ సేవా పథకానికి శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. జాతీయ సేవా పథకం కార్యక్రమ సమన్వయ అధికారి ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు సాధించిందన్నారు. కార్యక్రమ సమన్వయ అధికారులు, కార్యక్రమ అధికారులు, వాలంటీర్లు వివిధ స్థాయిల్లో ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. వాలంటీర్లు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందడంతో పాటు ప్రముఖ కార్యక్రమాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారని పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం ఘన వారస త్వాన్ని ప్రస్తుత తరం కొనసాగిస్తూ సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసు కెళ్లాలని ఆకాంక్షించారు. మాజీ జాతీయ సేవా పథకం కార్యక్రమ సమన్వయ అధికారి, మాజీ పార్లమెంటు సభ్యుడు ఆచార్య ఆజ్మీర్ సీతారాం నాయక్ మాట్లాడుతూ తన జీవితంలో జాతీయ సేవా పథకం కీలక అవకాశాలకు వేదికగా నిలిచిం దన్నారు. జాతీయ సేవా పథకం ద్వారా ప్రజా సేవ పట్ల తనలో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యు న్నతికి నిరంతరం కృషి చేస్తానని, జాతీయ సేవా పథకం సేవలను మరింత విస్తరించేందుకు విశ్వవిద్యాల యంలో జాతీయ సేవా పథకం భవన్ నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. తెలంగాణ అకాడమీ ఛైర్మన్, మాజీ జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి ఆచార్య కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వంటి భారీ ప్రజా సమూహాలు పాల్గొనే కార్యక్ర మాల్లో జాతీయ సేవా పథకం వాలంటీర్లు అందించిన సేవలు విశేష మైనవని అన్నారు. సేవా, అవగాహన కార్యక్రమాల ద్వారా వేలాది మంది విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంపొం దించామని తెలిపారు. జాతీయ సేవా పథకం యువతను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే ఉద్యమమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్య, వ్యక్తిత్వ, మానసిక వికాసానికి విశ్వవి ద్యాలయం అనేక కార్యక్రమాలు నిర్వ హిస్తోందన్నారు. విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావడంలో జాతీయ సేవా పథకం ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ సందర్భంగా పూర్వపు జాతీయ సేవా పథకం వాలంటీర్లు రూపొందించిన 'సేవా కులం' పాటను ఆవిష్కరిం చారు. మాజీ సమన్వయ అధికారులు, కార్యక్రమ అధికారులు, వాలంటీర్లు, ప్రస్తుత అధికారులు, వాలంటీర్లను వారి సేవలకు గుర్తింపుగా శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులు ప్రద ర్శించిన పాటలు, నృత్యాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య టి. మనోహర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎన్. రమణ, మాజీ జాతీయ సేవా పథకం సమన్వయ అధి కారులు ఆచార్య జి. బాలస్వామి, ఆచార్య ఎం. కిష్టయ్య, ఆచార్య బి. సురేష్ లాల్, ఆచార్య సుంకరి జ్యోతి, పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, కార్యక్రమ అధికారులు ప్రవీణ్, ప్రభాకర్, రాధిక, సౌజన్య, జాతీయ సేవా పథకం వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సత్యం మరణం పార్టీకి తీరని నష్టం

- కార్మికుల హక్కుల కోసం సత్యం చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం
- ఆయన ఆశయ సాధనకు నేటి కామ్రేడ్స్ కృషి చేయాలి: మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి



జనగామ జిల్లా, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): జనగామ జిల్లాలో సీపీఐ పార్టీ నిర్మాణానికి కామ్రేడ్ తొర్ర సత్యం చేసిన సేవలు చిరస్మరణీయ మని, ఆయన మరణం పార్టీకి తీరని నష్టమని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు.సీ పీఐ సత్యంగా పేరుగాంచిన కామ్రేడ్ తొర్ర సత్యం ఐదో వర్ధంతి సందర్భంగా గురువారం జనగామ వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఆయన స్తూపం వద్ద నివాళులర్పించారు. సత్యం చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం సీపీఐ జనగామ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య అధ్యక్ష తన సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ జనగామ పట్టణంలో సీపీఐ పార్టీ నిర్మాణంతో పాటు ఏఐటీయూసీ హమాలీ కార్మిక సంఘం నిర్మాణంలో తొర్ర సత్యం ప్రత్యేక పాత్ర పోషించా రని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా, వ్యవసాయ మార్కెట్ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పనిచేశారని పేర్కొన్నారు.చిన్న వయసులోనే అనారోగ్యంతో సత్యం మరణించడం జనగామ జిల్లా సీపీఐ పార్టీ నిర్మాణానికి తీవ్ర నష్టం కలిగిం చిందన్నారు. జిల్లా పార్టీ సహాయ కార్య దర్శిగా, ప్రజానాట్యమండలి నాయకు డిగా కూడా పనిచేస్తూ ప్రజల్లో చైతన్యం, పోరాట స్ఫూర్తిని పెంపొం దించారని తెలిపారు. ఆయన లేని లోటు పార్టీకి, కుటుంబానికి తీరని నష్టమని పేర్కొన్నారు.సత్యం చూపిన తెగువ, పోరాట దీక్షను నేటి కామ్రేడ్స్ ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగాలని రాజారెడ్డి పిలుపునిచ్చారు. సత్యం బావ, కాంగ్రెస్ పార్టీ కళారంగం రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు మాట్లాడుతూ పేద ప్రజలు, కార్మికుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సత్యం మరణం ఎర్రజెండాకు, తమ కుటుం బానికి తీవ్ర నష్టమన్నారు. కుటుంబ బంధాల కంటే వర్గ సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా సత్యం నిలిచిపోయారని పేర్కొన్నారు. పేద కుటుంబంలో పుట్టి తన పోరాటంతో గొప్ప పేరు సంపాదించు కుని లక్షలాది మంది కార్మికుల హృదయాల్లో స్థానం సంపాదించారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, ఏఐటీ యూసీ జిల్లా నాయకులు చామకూర యాకూబ్, గుండెల్లి రాజు, భూమల ఐలయ్య, తిప్పరపోయిన సిద్ధులు, యాకయ్య, సుదర్శనం, ఊదరి వెంకటాద్రి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు యాదలక్ష్మి , సత్యం సతీమణి తొర్ర లలిత, సీపీఐ, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ భూపాలపల్లి ధర్నాకు బీఆర్ఎస్ నేతలు

- థర్మల్ పవర్ స్టేషన్ వద్ద మహాధర్నాకు ములుగు జిల్లా బీఆర్ఎస్ నాయకులు
- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్





భూపాలపల్లి, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యుత్ కోతలను నిరసిస్తూ భూపా లపల్లి థర్మల్ పవర్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, పార్టీ నాయకులు గురువారం ఏటూరునాగారం నుంచి బయలుదేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంక టరమణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.ఉమ్మడి జిల్లా పార్టీ నాయకత్వంతో కలిసి నిర్వహిస్తున్న ఈ మహాధర్నాలో లక్ష్మణ్‌బాబు పాల్గొని విద్యుత్ సరఫరా, రైతుల సమస్యలపై పార్టీ వైఖరిని వెల్లడించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యుత్ కోతలతో పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరించకపోతే రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత విస్తృతం చేస్తామని హెచ్చరిం చారు.కార్యక్రమంలో పోరిక గోవింద్ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్‌రావు, భూక్య జంపన్న, తాడూరి రఘు, కర్ర రవీందర్, ఎండీ ఖాజా పాషా, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ఓ కారు పార్కింగ్‌తో ప్రజలకు ఇబ్బందులు?

- నడికూడ తహసీల్దార్ కార్యాలయం వద్ద అస్తవ్యస్త పార్కింగ్‌పై ప్రశ్నలు
- అధికారుల కార్యాలయానికి వచ్చే ప్రజలు లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు





నడికూడ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): నడికూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్‌పై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ సమస్యలపై అధి కారులను కలిసేందుకు లోపలికి వెళ్లాల్సి ఉండగా, వాహనాల పార్కింగ్ విధానం వల్ల ప్రవేశ మార్గంలో ఇబ్బందులు ఎదురవుతు న్నాయని పలువురు పేర్కొంటు న్నారు.ప్రత్యేకంగా తహసీల్దార్ వాహనం పార్కింగ్ చేసే విధానంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అధికారుల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించకుండా ప్రవేశ మార్గానికి ఇబ్బంది కలిగేలా వాహనాలు నిలిపితే, కార్యాలయా నికి వచ్చే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, రైతులు ఎలా లోపలికి వెళ్లాలన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో పార్కింగ్, ప్రవేశ మార్గాల విషయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్‌కు క్రమబ ద్ధమైన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిలో లంచాల ఆరోపణలు

- వైద్య సేవల పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు
- ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి



ఏటూరునాగారం, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏజెన్సీ ప్రాంతంలోని పేద, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి అన్నారు. వైద్యం కోసం వచ్చే పేద ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చుట్టుపక్కల ఐదారు మండలాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది పేద, గిరిజన ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని రవి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందాల్సిన వైద్య సేవల కోసం అదనంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఉంటే పేద కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్య సేవలతో పాటు జనన ధ్రువీకరణ పత్రాలు వంటి ఇతర సేవల విషయంలోనూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు తదితరులు పాల్గొన్నారు.

సజ్జనార్‌పై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- వీరశైవ జంగమ సమాజం

- గణేశ్ నిమజ్జన వేడుకలను రాజకీయాలకు దూరంగా నిర్వహించాలి
- పోలీస్ అధికారులపై వ్యక్తిగత హెచ్చరికలు చేయడం తగదు: శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తెలంగాణ రాష్ట్ర వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి తీవ్రంగా వ్యతిరేకించారు. పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు, హెచ్చరికల ధోరణిలో మాట్లాడటం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. గణేశ్ నిమజ్జన వేడుకల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, రెచ్చగొట్టే లేదా అభ్యంతరకరమైన పాటలు, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో ధ్వని వ్యవస్థలను వినియోగించడంపై పోలీసులు చర్యలు తీసుకుంటామని సజ్జనార్ పేర్కొన్న నేపథ్యంలో ఈ వివాదం నెలకొంది. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా నిర్వాహకులు సహకరించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సజ్జనార్‌పై విమర్శలు చేశారు. గణేశ్ నిమజ్జనంలో కేసీఆర్‌కు సంబంధించిన పాటలపై ఆంక్షలు విధించడాన్ని ప్రశ్నిస్తూ ఆయన వ్యాఖ్యలు చేసినట్లు తాజా వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యాఖ్యలపై సదా నిరంజన్ సిద్ధాంతి స్పందిస్తూ.. విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన పాటల వల్లనైనా ఉత్సవాల పవిత్రతకు భంగం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో పోలీస్ అధికారులను ఉద్దేశించి వ్యక్తిగత హెచ్చరికలు చేయడం, ఉన్నత పదవిలో ఉన్న అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా అర్చక సమాజం నుంచి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాలు పోలీసులకు, అధికారులకు సహకరించాలని సదా నిరంజన్ సిద్ధాంతి కోరారు.

రూ.4,516లకు గణపతి లడ్డూ కైవసం

- చింతలపల్లి ఎస్సీ కాలనీలో ఉత్సాహంగా లడ్డూ వేలంపాట
- అడ్డూరి అనిల్, లావణ్య దంపతులకు దక్కిన గణపతి ప్రసాదం





హనుమకొండ/ ఎల్కతుర్తి , సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గణపతి నిమజ్జనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంపాట భక్తుల సందడి మధ్య ఉత్సాహంగా సాగింది. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లడ్డూను వేలం వేయగా, భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ప్రసాదాన్ని దక్కించుకునేందుకు పోటీ పడ్డారు.వేలం పాటలో అడ్డూరి అనిల్, లావణ్య దంపతులు రూ.4,516లకు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూను వారికి అందజేసి అభినందనలు తెలిపారు. గణపతి లడ్డూ దక్కడం పట్ల అనిల్, లావణ్య దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. గణపతి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం గణపతి విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిగీతాలు, భజనలతో నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో చింతలపల్లి ఎస్సీ కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఇంట్లో బంధించిన జయశ్రీకి న్యాయం చేయాలి

- అత్త మీరాబాయిపై చర్యలు తీసుకోవాలి..
- గతంలో రాసిచ్చిన ఇల్లు, ఆస్తులు ఇప్పించాలి
- సుబేదారి ఎస్సై సుమన్‌కు ప్రజా సంఘాల నేతల వినతి





హన్మకొండ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): న్యాయం కోసం ఇంట్లో బంధించబడి నిరసన చేస్తున్న గూడూరు జయశ్రీకి న్యాయం చేయాలని దళిత, మహిళా, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జయశ్రీని ఇంట్లో బంధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె అత్త మీరాబాయిపై చర్యలు తీసుకోవడంతో పాటు, గతంలో రాజీ సందర్భంగా రాసిచ్చిన ఇల్లు, ఆస్తులను బాధితురాలికి ఇప్పించాలని కోరారు. ఈ మేరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు గురువారం సుబేదారి ఎస్సై సుమన్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, నేదునూరి జ్యోతి, మాదాసి సురేష్ మాట్లాడుతూ.. గతంలో జయశ్రీపై ఆమె అత్త మీరాబాయి, భర్త రాధాకృష్ణ గృహహింసకు పాల్పడుతూ అదనపు కట్నం కోసం వేధించారని తెలిపారు. దీనిపై జయశ్రీ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తదనంతరం జరిగిన రాజీ ప్రకారం హన్మకొండ రాంనగర్‌లోని ఇల్లు, హన్మకొండ చౌరస్తాలోని దుకాణాన్ని నోటరీ పత్రం ద్వారా జయశ్రీకి రాసిచ్చినట్లు వారు తెలిపారు. అయితే పదేళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించి జయశ్రీతో పాటు ఆమె కుమారుడు కార్తీక్, కుమార్తె తేజస్వినిని ఇంటి నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులను తీసుకొచ్చి జయశ్రీ సామగ్రిని తరలించే ప్రయత్నం చేయగా, ఆమె తన కుమార్తెతో కలిసి అడ్డుకున్నారని తెలిపారు. దీంతో మీరాబాయి, ఆమె కుమార్తెలు, అల్లుళ్లు కలిసి జయశ్రీ, ఆమె కుమార్తెను ఇంట్లోనే బంధించి తాళం వేసినట్లు ఆరోపించారు. బాధితులు తిండి, నిద్ర లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని బాధితురాలికి రక్షణ కల్పించడంతో పాటు, ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్సై సుమన్‌ను ప్రజా సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, చైతన్య మహిళా సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంపాల కళా, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సంగెం స్వరూప, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నాయకురాలు పొడిచేటి సరళ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్‌కు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ

- భీమారంలోని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే



హనుమకొండ, సెప్టెంబర్ 24 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం భీమారంలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తన బ్యాచ్‌మేట్, మిత్రుడైన సుదర్శన్ గౌడ్‌తో ఎమ్మెల్యే నాగరాజు కొంతసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రస్తుతం అందుకుంటున్న వైద్య సేవలు, వైద్యుల సూచనలు, తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ శాఖలో కలిసి పనిచేసిన రోజుల్ని, సుదర్శన్ గౌడ్ అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.అనారోగ్య సమయంలో ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందించే ధైర్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. సుదర్శన్ గౌడ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. అవసరమైన సమయంలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. పదవులు, బాధ్యతలు మారినా స్నేహబంధం కొనసాగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పిడుగుపాటుతో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం

- పాక్షికంగా దెబ్బతిన ఇంటిని పరిశీలించిన
- మండల ఎంపీడీవో సూర్ణ ఆదర్శ్ గౌడ్
- మండల తహసిల్దార్ శ్రీనివాస్
- ఉమ్మడి మండలాల మాజీ జడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్





నిత్యం నిఘా, వనపర్తి , సెప్టెంబర్ 18 : చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మి పల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్ ఇంట్లు పిడుగుపాటుకు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మండలాల మాజీ జడ్పిటిసి ఇటిక్యాల కృష్ణ ప్రసాద్ యాదవ్ ఉటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని చిన్నంబావి మండల ఎంపీడీవో మరియు తాహసిల్దార్ గారికి సమాచారం ఇచ్చి పిడుగుపాటుకు దెబ్బతిన్న సంపంగి ఈశ్వర్ ఇంటిని పరిశీలన చేశారు. విద్యుత్ వైర్లలో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని విద్యుత్ పరికరాలు, సామగ్రి దెబ్బతిన్నట్లు సమాచారం. అగ్ని ప్రమాదంతో ఇంట్లో కూలరు, వాషిం, ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, గోడలు, కరెంటు వైర్లు బోర్డులు మీటరు పైభాగం తదితర ప్రాంతాలు పొగతో నల్లగా మారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని సామగ్రి, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది. పిడుగుపాటుకు ప్రాణనష్టం తప్పినా.. భారీ ఆస్తి నష్టం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ఘటనతో సంపంగి ఈశ్వర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఘటనను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com